క్లుప్తంగా

వైద్య సేవల పరిశీలన



డీఎంఅండ్‌హెచ్‌ఓతో ట్రైనీ కలెక్టర్

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాన్ని మంగళవారం ట్రైనీ కలెక్టర్ మేఘస్వరూప్ సందర్శించారు. డీఎంఅండ్‌హెచ్ ఓజీ.ప్రకాశంతో శాఖాపరమైన సేవలు, విధుల అంశాలను తెలుసుకున్నారు. విభాగాల వారీగా పనిచేసే అధికారులు, సిబ్బంది, పీహెచ్‌సీల పనితీరు, మందులు, మాత్రల నిల్వలపై పూర్తి స్థాయిలో సమీక్షించారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

చిత్తూరు కార్పొరేషన్: పెండింగ్ జీతాలు ఇవ్వాలని గ్రీన్ అంబాసిడర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరాములు కోరారు. ఈమేరకు మంగళవారం డీపీఆర్సీ కార్యాలయంలో డీసీ షణ్ముగంకు వినతి పత్రం అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా ఆరోగ్యాన్ని కాపాడుతున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. నాయకులు నాగరాజన్ పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ



గుడిపాల : బొమ్మసముద్రం జూనియర్ కళాశాలలోని 135 మంది విద్యార్థులకు మంగళవారం బొమ్మసముద్రం గ్రామానికి చెందిన రాజేష్ కన్నన్ ఒక్కొక్కరికి రెండు నోటు పుస్తకాలు, రెండు పెన్నులను వితరణగా అందజేశారు. కళాశాల ఆవరణలో శిథిలావస్థలో ఉన్న భవనాన్ని మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. ప్రిన్సిపల్ శరత్‌చంద్రశేఖర్, అధ్యాపకులు రెడ్డెప్ప పాల్గొన్నారు.

ఎంపీడీఓ తనిఖీలు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: మండలంలో ఎంపీడీఓ గౌరి పలుచోట్ల తనిఖీలు చేశారు. వేపనపల్లిలో ఉపాధి పథకాన్ని ఆమె పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న కూలీలను పలకరించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఒంటిల్లులోని ప్రాథమిక పాఠశాలలో తలపులపల్లి పంచాయతీ వడ్డెపల్లిలోని అంగన్‌వాడీలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు.

కార్మిక చట్టాలను కాపాడుకుంటాం



సీఐటీయూ జెండా ఆవిష్కరణ

గుడిపాల: కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నీరుగార్చే ప్రయత్నాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర పిలుపునిచ్చారు. సీఐటీయూ మహాసభలు బెంగళూరులో జరుగుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా యూనియన్ జెండాలను ఎగురవేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్లు పెట్టుకునేందుకు కూడా హక్కు లేకుండా, శ్రమ దోపిడీని మరింత పెంచేందుకు కేంద్రప్రభుత్వం ప్రత్యేకమైన కోడ్‌లను తీసుకురానుందని, దీన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. పలువురు కార్మికులు పాల్గొన్నారు.

వివేకానంద ఆదర్శం కావాలి



ర్యాలీలో ఏబీవీపీ కార్యకర్తలు

చిత్తూరు కలెక్టరేట్ : యువతకు స్వామి వివేకానంద ఆదర్శం కావాలని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ మెంబర్ హేమంత్ అన్నారు. మంగళవారం నగరంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను పురస్కరించుకుని ముందస్తుగా ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారతదేశం గొప్పతనం ప్రపంచం నలుమూలలకు చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి వివేకానంద అని తెలిపారు. యువత ఆయన అడుగు జాడల్లో నడవాలని కోరారు. అనంతరం నగరంలో కట్టమంచి వద్ద ఉన్న వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏబీవీపీ పట్టణ కార్యదర్శి పురుషోత్తం, పీవీకేఎన్ వైస్ ప్రెసిడెంట్ హేమంత్, కళాశాల విద్యార్థులు, ఏబీవీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే జగనన్న లక్ష్యం

- అర్హతే పథకాల లబ్ధికి ప్రామాణికం
- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు
- తుమ్మిందలో గడప గడపకు మన ప్రభుత్వం



తుమ్మిందలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: పేదల అభ్యున్నతే లక్ష్యంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. చిత్తూరు మండలం తుమ్మింద పంచాయతీలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్‌ను అందజేశారు. సమస్యలను తెలుసుకున్నారు. ఇంటి స్థలం, భూ సమస్యలు, రోడ్డు, కరెంటు, కాలువలు సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఆయాశాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటలకు కట్టుబడి సీఎం పనిచేస్తున్నారన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, సంక్షేమ లబ్ధితో పేదవర్గాలు ఆర్థికంగా అభ్యున్నతి చెందుతున్నాయని తెలిపారు. ప్రతి సచివాలయ పరిధిలో సమస్యల పరిష్కారానికి రూ.20 లక్షలు కేటాయించినట్లు పేర్కొన్నారు. గత చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే పథకాలు అందేవని, నేడు అర్హత ఉంటే పథకాలు ఇంటి ముంగిటకే అందుతున్నాయని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరిస్తే జగన్‌మోహన్‌రెడ్డి మరిన్ని పథకాలను తీసుకొస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఎంఎస్ బాబునాయుడు, వైస్‌ఎంపీపీ రంజని, జయరాం, నాయకులు త్యాగరాజులు, అమర్‌నాథ్‌రెడ్డి, కుమార్, జయపాల్, మునిరత్నం, వెంకటేష్, మణిబాబుపిళ్లై, రామ్మూర్తి, రాజు, మనోహర్, రాజా, సురేష్, బాబు, నంద, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, తహసీల్దార్ పార్వతి, ఎంపీడీఓ రాఘువేంద్ర వర్మ, ఎంఈఓ సెల్వరాజ్, ఏఓ వేణుగోపాల్. పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

నేడు పెద్దిశెట్టిపల్లెలో ..

చిత్తూరు మండలం పెద్దిశెట్టిపల్లె బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొంటారని ఎంపీడీఓ రాఘవేంద్రవర్మ తెలిపారు. ఉదయం 6.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అధికారులు, సచివాలయ సిబ్బంది తప్పక హాజరు కావాలని తెలిపారు.

సంక్షేమాన్ని వివరిస్తూ.. సమస్యలు పరిష్కరిస్తూ..



చినకాంపల్లెలో లబ్ధిదారులకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

ఐరాల: ప్రజలకు సంక్షేమాన్ని వివరిస్తూ, గ్రామాల్లో సమస్యలను పరిష్కరిస్తూ పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు చినకాంపల్లె సచివాలయ పరిధిలో ముందుకుసాగారు. మంగళవారం లింగారెడ్డి ఇండ్లు, మిట్ట ఇండ్లు, ఎస్టీ కాలనీ, దామరగుంట, కురప్పపల్లె, వడ్రాంపల్లె, వడ్రాంపల్లె దళితవాడ, చినకాంపల్లె బీసీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. 411 గడపలకు వెళ్లి సంక్షేమ లబ్ధిని లబ్ధిదారులకు వివరించారు. గ్రామాల్లో సమస్యల్ని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరంతరం ప్రజల కోసం పరితపిస్తున్న సీఎం జగనన్నకు మళ్లీ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. నేడు కులం, మతం, వర్గం, పార్టీలలకు అతీతంగా అర్హులకు పథకాలు అందిస్తున్నారని చెప్పారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ మోహన్, మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, యువజన విభాగం కన్వీనర్ భార్గవ్‌రెడ్డి, నియోజకవర్గ సేవాదళ్ కన్వీనర్ హరీష్‌రెడ్డి, నేతలు చలపతిరెడ్డి, సురేష్‌రెడ్డి, ధనచంద్రరెడ్డి, రవిచంద్రరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, చంద్రరెడ్డి, చిన్నారెడ్డి, రాము, దొరబాబు, ఎంపీడీఓ నిర్మలాదేవి, ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



బాలాజీ, ఇమ్రాన్, బబిత

గుడిపాల: గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా చీలాపల్లె ఇంజినీరింగ్ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీగా బాలాజీ (నంగమంగళం), ట్రెజరర్‌గా బబితను(వసంతాపురం)ను ఎన్నుకున్నారు. వీరిని ఎంపీడీఓ ఉపేంద్ర, పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజినీర్ జయచంద్రారెడ్డి అభినందించారు.

జల్లికట్టు నిర్వహిస్తే చర్యలు

తవణంపల్లె: సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో జల్లికట్టు నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తవణంపల్లె ఎస్‌ఐ ప్రసాద్ తెలపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినాన్ని ప్రజలు సంప్రదాయాలతో సంతోషంగా జరుపుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పల్లెల్లో జలికట్టు, కోడిపందేలు, పేకాట ఆడకూడదని తెలిపారు. పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. చట్టవిరుద్ధమైన కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.


వినాయకుని సేవలో ప్రిన్సిపల్ సెక్రటరీ



వాణి మోహన్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఏఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామిని రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ (పురావస్తు శాఖ, పర్యావరణ, క్రీడలు) వాణి మోహన్ మంగళవారం దర్శించుకున్నారు. ఆమె స్వామివారి దర్శనార్థం ఆలయానికి విచ్చేయగా ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులచే ఆశీర్వచనం అందించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం ఆమె సంకటహర చతుర్థి వ్రతంలో పూజలు నిర్వహించారు.

అనధికార లేఔట్లపై కార్పొరేషన్ కొరడా



లేఔట్ల తొలగింపులో అధికారులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరం సంతపేట, చవటపల్లె ప్రాంతాల్లో అనధికార లేఅవుట్లపై మంగళవారం నగరపాలక సంస్థ అధికారులు కొరడా ఝుళిపించారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ రామకృష్ణుడు, అధికారులు మురళీకృష్ణ, జకీరా సిబ్బంతో వెళ్లి అనాధికార లేఔట్లను తొలగించారు. పలువురు యజమానులకు నోటీసులు ఇచ్చారు.

రెండు తలల దూడ జననం



రెండు తలల దూడ

వెదురుకుప్పం : మండలంలోని దిగువపల్లూలు పంచాయతీ ఇరగమరెడ్డి ఇండ్లు గ్రామంలో ఏకాంబరరెడ్డికి చెందిన పాడి ఆవు రెండు తలల దూడను ఈనింది. ఈనిన వెంటనే దూడ చనిపోయింది తెలిపారు. గ్రామస్తులు దీన్ని వింతగా తిలకించారు.

వరసిద్ధునికి విరాళాల వెల్లువ



విరాళం అందజేస్తున్న దాత జయదేవ్



విరాళం అందిస్తున్న వెంకటమధు



విరాళం అందిస్తున్న హరికృష్ణ

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామికి విరాళ దాతలు రూ.3లక్షలు విరాళంగా మంగళవారం ఆలయ అధికారులకు అందించారు. చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం సంజీవిరాయనపల్లెకు చెందిన జయదేవ్ స్వామివారి నిత్య అన్నదానానికి రూ.50 వేలు, గోసంరక్షణ ట్రస్టుకు రూ.50వేలు, వైఎస్సార్ కడప జిల్లా అక్కయ్యపల్లెకు చెందిన దాత హరికృష్ణ స్వామివారి నిత్య అన్నదానానికి రూ.లక్ష, మైదుకూరుకు చెందిన దాత వెంకట మధుశేఖర్ స్వామివారి నిత్య అన్నదానానికి రూ.50 వేలు, గోసంరక్షణ ట్రస్టుకు రూ.50 వేలు విరాళాలను ఆలయ అధికారులకు అందజేశారు. దాత కుటుంబసభ్యులకు ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్‌లు కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు, బాబు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

నగరి : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి పోటీలకు వశిష్ఠ విద్యాలయ విద్యార్థులు కేసీ తేజేష్, భానుప్రకాష్ ఎంపికయినట్లు విద్యాలయ కరస్పాండెంట్ రాజరాజేశ్వరి, హెచ్ఎం జయచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించింది. పీఈటీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల 20, 21, 22 తేదీల్లో మదనపల్లె జెడ్పీ హైస్కూల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు.

భ్రూణ హత్యలు నేరం



మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

గంగాధరనెల్లూరు: భ్రూణ హత్యలు చట్ట రీత్యా నేరమని తూగుండ్రం వైద్యాధికారి దివ్య హెచ్చరించారు. మం డలంలోని ఎస్ఎస్‌కొండ గ్రామంలో మంగళవారం లింగ వివక్ష నిర్మూలన, నిషేధ చట్టంపై అవగాహన కల్పించా రు. ఆమె మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చేయకూడదని తెలిపారు. ప్రభుత్వం అనుమతించిన స్కానింగ్ కేంద్రాల్లో మాత్రమే జన్యుపరమైన సమస్యలు, క్రోమోజోములసంఖ్య తెలుసుకునేందుకు, బిడ్డ ఎదుగుదల కోసం, ఆరోగ్యస్థితి తెలుసుకునేందుకు మాత్రమే స్కానింగ్ చేయాలని పేర్కొన్నారు. ఆరోగ్యవిద్యాధికారి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే రూ.10 వేల జరిమానాతో పాటు మూడు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తారని తెలిపారు.

ర్యాగింగ్ చేయం.. ప్రోత్సహించం..!

కార్వేటినగరం: విద్యార్థులు ర్యాగింగ్ దూరంగా ఉండాలని, కేసులు నమోదైతే భవిష్యత్ అంధకారంగా మారుతుందని దిశ డీఎస్పీ రామరాజు తెలిపారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం యాంటీ ర్యాగింగ్ సెల్ ఆధ్వర్యంలో ర్యాగింగ్ నివారణ, దిశ చట్టంపై అవగాహన కల్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే చట్ట పరంగా కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. కళాశాలలో స్నేహపూరిత వాతావరణం ఉండాలని సూచించారు. ర్యాగింగ్ కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్ నాశనమవుతుందని తెలిపారు. చట్టాలపై స్మార్ట్ బోర్డ్ ద్వారా అవగాహన కల్పించారు. దిశ మహిళా ఎస్ఐ గిరిజ మాట్లాడుతూ దిశా చట్టం ప్రయోజనాలను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ విజయులురెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, రాగింగ్‌కు పాల్పడినా, ప్రోత్సాహించినా నేరమని తెలిపారు. అనంతరం విద్యార్థులతో ర్యాగింగ్‌కు పాల్పడమని, ప్రోత్సహించమని ప్రతిజ్ఞ చేయించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ధనంజయరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి వ్రతం



ఆలయంలో సంకటహర చతుర్థి వ్రతాన్ని ఆచరిస్తున్న భక్తులు



గ్రామోత్సవంలో పాల్గొన్న ఆలయ అధికారులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో మంగళవారం సంకటహర చతుర్థి వ్రతాన్ని ఆలయ అర్చక వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పౌర్ణమి తరువాత నాల్గవరోజు ఆలయంలో సంకటహర చతుర్థి వ్రతాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం సిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలను అలంకార మండపంలో కొలువుదీర్చి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు నిర్వహించి పూజలు చేశారు. ఉదయం 10 గంటలకు, సాయంత్రం 4 గంటలకు ఆలయంలో రెండు విడతలుగా శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి వ్రతాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున వ్రత పూజల్లో పాల్గొన్నారు.. ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు, బాబు పాల్గొన్నారు.

స్వర్ణరథంలో విహరించిన గణనాథుడు

సంకటహర చతుర్థిని పురస్కరించుకుని శ్రీవరసిద్ధి వినాయకస్వామి సిద్ధి, బుద్ధి సమేతంగా మంగళవారం రాత్రి స్వర్ణరథంలో ఆలయ మాడ వీధుల్లో విహరించారు. స్వర్ణరథం విహరిస్తున్న స్వామి వారిని దర్శించి భక్తులు తన్మయత్వం చెందారు. భక్తులు స్వామివారికి కర్పూర హారతులు సమర్పించారు. ఈఈ వెంకటనారాయణ, ఇన్‌స్పెక్టర్ రమేష్ బాబు, డీఎస్పీ శ్రీనివాసమూర్తి, వెస్ట్ సీఐ శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం పెట్టాలి



ఎగువరాగిమానుపెంట జెడ్పీ హైస్కూల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ

బంగారుపాళెం: విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని పెట్టాలని జిల్లా విద్యాశాఖాధికారి విజయేంద్రరావు అన్నారు. మంగళవారం ఎగువ రాగిమానుపెంట జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాలను డీఈఓ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. నాడు-నేడు పనుల పురోగతిని హెచ్ఎం సుజాతను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం పిల్లలకు నాణ్యమైన భోజనాన్ని పెట్టాలని నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి, పలు సూచనలు ఇచ్చారు.

ప్రొబేషన్ డిక్లేర్ చేయాలని వినతి



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో పని చేస్తున్న వీఆర్‌ఓల ప్రొబేషన్‌ను డిక్లేర్ చేయాలని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలాజీరెడ్డి, పద్మనాభం కోరారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు మంగళవా రం కలెక్టరేట్‌లో జేసీ వెంకటేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గ్రేడ్-1, గ్రేడ్-2 వీఆర్‌ఓలు ప్రొబేషన్ మంజూరు కోసం నిరీక్షిస్తున్నారని తెలిపారు. పలు సమస్యలను వివరించారు. సమస్యలను పరిష్కరిస్తామని జేసీ తెలిపారు. సంఘ నాయకులు, పలువురు వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

రూటా క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూటా) 2023 క్యాలెండర్‌ను డీఈఓ విజయేంద్రరావు ఆవిష్కరించారు. మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో డీఈఓ మాట్లాడుతూ ఉర్దూ పాఠశాలల్లో అడ్మిషన్ల పెంపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సెల్వరాజ్, హెచ్ఎం త్యాగరాజులురెడ్డి, ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మునీర్‌అహ్మద్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సాలేహా పాల్గొన్నారు.

కరాటేలో నగరి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో కరాటే నిర్వాహకులు, మాస్టర్లు

నగరి : తమిళనాడు తిరుత్తణిలో జరిగిన కరాటే పోటీల్లో నగరి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జపాన్‌షిటోరాయ్ కరాటే స్కూల్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు తిరుత్తణిలో జరిగిన కరాటే పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో ఏ.కార్తికేయన్, మోహనవేలు, మోహిత్ ఆరెంజ్ బెల్టు, గీతిక, విశ్వ ఎల్లో బెల్టు దక్కించుకున్నారు. ప్ర తిభ చూపిన విద్యా ర్థులకు నిర్వాహకులు షీల్డ్, కప్పులు అందించారు. కరాటే మాస్టర్ అన్నా దొరై, ఇతర కరాటే శిక్షకులు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న వెంకటరమణారెడ్డి, నాయకులు

గంగాధరనెల్లూరు : తూ ర్పు రాయలసీమ పట్టభద్రుల ఎంఎల్‌సీ వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి పేర్నా టి శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ మండలంలో మంగళవారం పార్టీ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. పార్టీ జీడీనెల్లూరు నియోజకవర్గ పరిశీలకుడు వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో జీడీనెల్లూరు, వేల్కూరు, బుక్కాపట్నం సచివాలయ పరిధిలో గ్రాడ్యుయేట్ ఓటర్లను కలసి కరపత్రాలను అందజేశారు. శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని అ భ్యర్థించారు. శ్యాంప్రసాద్‌రెడ్డి అందుబాటులో ఉంటూ సేవలందిస్తారని తెలిపారు. వైస్ ఎంపీపీ హరిబాబు, మాజీ వైస్ ఎంపీపీ మునిరాజులురెడ్డి, నాయకులు గోవిందరెడ్డి, పుష్పరాజ్, లారె న్స్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పుత్తూరు రూరల్: ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కోరారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ భవనంలో తిరుపతి జిల్లా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి భద్రత కల్పించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుమార్‌రెడ్డి, రాధాకృష్ణ, గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.